నేడు ఓటింగ్ డే

- పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం
- పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సామగ్రి
- ప్రత్యేక బందోబస్తు..144 సెక్షన్ అమలు
- ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారుల సూచన

కొడంగల్: పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు

తాండూరు: ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన సిబ్బంది

పరిగి, మే 12 : పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది. పరిగిలోని మినీ స్టేడియంలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీ చేపట్టారు. పరిగి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,66,566 మంది ఓటర్లుండగా వారిలో పురుషులు 1,33,568 మంది, మహిళలు 1,32,989 మంది, ఇతరులు 9 మంది ఉన్నారు. వారందరు సోమవారం తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. పరిగి నియోజకవర్గంలోని 305 పోలింగ్ కేంద్రా ల్లో 305 మంది పోలింగ్ ఆఫీసర్లు, 305 మంది ఎపీవోలు, 610 మంది ఓపీవోలు పోలింగ్ విధులు నిర్వహిస్తారు. మొత్తం 125 పోలింగ్ కేంద్రాల్లో లొకేషన్ కెమెరాలు, 60 కేంద్రాలలో బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 65 మంది మైక్రో అబ్జర్వర్లు పోలింగ్‌ను పర్యవేక్షించనున్నారు. మొత్తం 27 రూట్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది, సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు 34 బస్సులు, 29 తుఫాను వాహనాలలో తరలించారు. తమకు అందజేసిన పోలింగ్ సామాగ్రిని పోలింగ్ సిబ్బంది సరి చూసుకొన్న తర్వాత పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్: కలెక్టర్

ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు వికారాబాద్ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. పరిగిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలలో సిబ్బంది, ఓటర్లకు అన్ని సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. విద్యుత్, ఫ్యాన్‌లు, తాగునీరు, టెంట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని పోలింగ్ సిబ్బందికి ఆహారంలో ఎక్కు వగా ద్రవ పదార్థాలు ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్న ఉదయం, సాయంత్రం సమయాల్లో ఓటింగ్‌లో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. దివ్యాంగ ఓటర్ల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో వాహనాన్ని ఏర్పాటు చేసి, సిబ్బందితో వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చి తమ ఓటుహక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. దివ్యాంగ, వయో వృద్ధులైన ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాలలో వీల్ చైర్‌లు, వలంటీర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్లందరికీ ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయిం దని చెప్పారు. సెక్టోరల్ అధికారులు, పోలిసు బందో బస్తుతో పోలింగ్ సామగ్రిని తరలిస్తున్న బస్సులను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వాసుచంద్ర, స్వీప్ నోడల్ అధికారి సత్తార్, డీవైఎస్‌వో హనుమంతరావు, తహసీల్దార్ ఆనంద్‌రావు పాల్గొన్నారు.

వికారాబాద్: నేడు జరిగే సాధారణ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషనులకు ఈవీఎంలు, సామగ్రి తరలించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా లోని మేరీ నాట్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల అధికారులు, సిబ్బంది 284 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని 26 రూట్లకు ఆయా సెక్టరియాల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లలతో తరలించినట్లు తెలిపారు. పోలింగ్ అధికా రులు వీవీ ప్యాట్, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లను, పోలింగ్ సామా గ్రిని చెక్ చేసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. కంట్రోల్ యూనిట్ ఆన్ చేసి, అభ్యర్థుల లిస్టు కరెక్ట్ గా ఉందా లేదా అన్నది చెక్ చేయాలన్నారు. 13 నాడు ఉదయం 5.30 గంటలకు మాక్ పోల్ నిర్వహించాలని 7 గంటలకు పోల్ ప్రారంభించాలని అన్నారు. మొత్తం పోలైన ఓట్లు ప్రతి రెండు గంటలకు ఒకసారి రిపోర్ట్ ఇవ్వాలని ఎలాంటి సమస్య లు రాకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ , తహసీల్దార్ లక్ష్మీనారాయణ , ఎస్సీ వెల్ఫేర్ మల్లేశం, ఈ ఈ పీ ఆర్ ఉమేష్ కుమార్, మైనార్టీ వెల్ఫేర్ సుధారాణి, డీఈవో రేణుకా దేవి, సురేశ్ బాబు

పరిగి: బస్సులో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది

పెద్దేముల్ : అభ్యర్థుల జాబితాను అంటిస్తున్న ఎన్నికల సిబ్బంది

కులకచర్ల: మోడల్ పోలింగ్ కేంద్రం

సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

తాండూరు: తాండూరు పట్టణంలోని సెయింట్‌మార్క్స్ పాఠశాల నుంచి సంబంధిత అధికా రులు కేటాయించిన పోలింగ్ బూత్‌లకు ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి తాండూరులో పర్యవేక్షించారు. తాండూరు అసెంబ్లీలో 277 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తాండూరు నియోజక వర్గం ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. అందుల్లో మొత్తం 2 లక్షల 43 వేల 192 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఇందుల్లో స్త్రీలు 1,25, 364, పురుషులు 1,17,821, ట్రాన్స్‌జెండర్లు ఏడుగురు ఉన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి ఏదైన ఒక గుర్తింపు కార్డును తీసుకొని సకాలంలో ఓటును వినియోగించుకోవాలని సూచించారు. విధులకు హాజరు కాని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తును ఏర్పా టు చేసినట్లు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తెలిపారు. సమస్యాత్మకమైన 54 పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నియమాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవవన్నారు. ప్రశాంతమైన వాతావరణం లో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు కోరారు.

కొడంగల్: పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ నిర్వాహణకు గాను సిబ్బంది పోలింగ్ సామగ్రితో ప్రత్యేక వాహనాల్లో కేంద్రా లకు తరలి వెళ్లారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పరిశీలించారు. నియోజకవర్గంలోని మొత్తం 2,41749 మంది ఓటర్లు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారు. ఇందుకు సంబంధించి 282 పోలింగ్ కేంద్రాలకు గాను ఈవీఎం, వీవీ ప్యాట్‌లతో పాటు పోలింగ్ ప్ర క్రియ సామాగ్రిని సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లును వివరించారు. ఈవీఎం, వీవీప్యాట్‌లను సరి చూసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పోలింగ్ సమయాని కంటే ముందుగానే పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లును పూర్తి చేసుకునే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలని, ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండే విధంగా సౌకర్యాలు సమకూర్చుకోవాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తి అనంతరం వీవీ ప్యాట్, ఈవీఎంలను పూర్తి జాగ్రత్తతో స్ట్రాంగ్ రూం కేంద్రంలో అప్పగించాలని తెలిపారు.

బొంరాస్‌పేట: బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బొంరాస్‌పేట మండలంలో 39 పోలింగ్ కేంద్రాలు ఉండగా 31,783 మంది ఓటర్లు, దుద్యాల మండలంలో 30 పోలింగ్ కేంద్రాలు ఉండగా 23,843 మంది ఓటర్లు ఉన్నారు. బొంరాస్‌పేట మండలంలోని కొత్తూరు పోలింగ్ కేంద్రాన్ని, దుద్యాల మండలంలోని ఈర్లపల్లి పోలింగ్ కేంద్రాన్ని మాడల్ పోలింగ్ కేంద్రాలుగా అధికారులు తీర్చిదిద్దారు. పోలింగ్ సిబ్బంది సామగ్రితో తమ తమ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాలలో సిబ్బందికి అన్ని వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

మర్పల్లి: మండలంలో మొత్తం 44610 మంది ఓటర్లు ఉండగా అందులో 22543 మంది పురుషులు, 22037 మంది స్త్రీలు ఉన్నారు.. 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ గణేశ్ తెలిపారు.

పెద్దేముల్: మండల పరిధిలోని 37 గ్రామ పంచాయతీలలోని 54 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్‌కు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లను చేశారు. స్థానిక ఎస్ఐ కె.గిరి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ధారూరు: మండల పరిధిలో 47 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తం 35593 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 17526 మంది, మహిళలు 18067మంది ఉన్నారు.


తాండూరు: అధికారులతో మాట్లాడుతున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి

బొంరాస్‌పేట: పోలింగ్ కేంద్రంలోకి వస్తున్న సిబ్బంది

మర్పల్లి : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

వికారాబాద్ : పోలింగ్ సామగ్రితో ఎన్నికల అధికారులు

అంబేద్కర్ అందరివాడు

అంబేద్కర్ విగ్రహాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

కొడంగల్, మే 12: అంబేద్కర్ అందరి వాడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం పాటుపడుదామని అంబేద్కర్ యువజన సంఘం తాలూకా అధ్యక్షుడు రమేశ్‌బాబు, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్, న్యాయవాదులు బస్వరాజ్, వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటులో భాగంగా గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ నుంచి విగ్రహ ఏర్పాటు స్థలం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు భీంరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మల్‌రెడ్డి, రాములు, మాజీ సర్పంచ్ గుండప్ప, హన్మంతు, సాయులు, నాగారం వెంటేశ్, శంకర్ పాల్గొన్నారు.

సిరా చుక్క చూపి ఉచిత వైద్యం పొందండి

వికారాబాద్, మే 11 : దేశ భవిష్యత్తును నిర్మాణం చేసుకునే అవకాశం ఓటు హక్కు ద్వారా ఉంటుందని వికారాబాద్ మైత్రి హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ కె.శ్రావణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనే సంకల్పంతో నేడు ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు ఓటు వేసి, సిరా చుక్కను చూపించి వికారాబాద్ ఎంఆర్‌పీ పెట్రోల్ పంప్ ఎదురుగా ఆసుపత్రిలో ఉచిత కన్సల్టేషన్ తో వైద్యం పొందవచ్చన్నారు. డాక్టర్ సలహా మేరకు రక్త పరీక్షలు (సీబీపీ,ఆర్‌బీఎస్) కూడా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు ఉన్న అందరూ ఓటు వేసి ప్రజాస్వా మ్యాన్ని పరిరక్షించాలని కోరారు.

తొమ్మిదో తరగతి బాలికపై లైంగికదాడి

దవాఖానలో ప్రసవించడంతో.. వెలుగులోకి వచ్చిన ఘటన

ఎస్ఆర్ నగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు

వెంగళరావునగర్, మే 12: తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక (15)కు మాయమాటలు చెప్పిన శ్రీను (28) పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. కడుపునొప్పితో దవాఖానలో చేరిన బాలిక అక్కడే ప్రసవించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్ఆర్ నగర్ పీఎస్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు.. పోలీసు స్టేషన్ పరిధిలో నివసించే బాలిక వేరొక రాష్ట్రంలోని బాలికల పసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నది. సెలవుల్లో తరచూ ఇంటికి వచ్చి వెళ్లింది. ఈ క్రమంలోనే ఇంటి పక్కనే ఉంటున్న శ్రీను కుమారుడిని ఆడించేది. కామాంధుడైన శ్రీను.. ఆ బాలికపై కన్నేసి పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. భయంతో బాలిక ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేదు. ఈ క్రమంలో బాలిక రెండు రోజులుగా కడుపునొప్పిగా ఉన్నదని చెప్పడంతో కుటుంబసభ్యులు సమీపంలోని ఓ ప్రభుత్వ దవాఖానకు తీసుకువెళ్లారు. అక్కడ బాలికను పరీక్షించిన వైద్యులు గర్భవతిగా తేల్చారు. నెలలు నిండని బాలిక అప్పుడే ప్రసవించింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పలు సెక్షన్ల కింద నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాస్కులతో వచ్చి.. రాడ్లతో కొట్టి

గ్యాస్ ఏజెన్సీలో దోపిడీ దొంగల బీభత్సం

రూ.5 లక్షలు దోచుకువెళ్లిన దుండగులు

బంజారాహిల్స్, మే 12: ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్యాస్ ఏజెన్సీలో భారీ దోపిడీ జరిగింది. మాస్కులు ధరించి వచ్చిన ఇద్దరు దుండగులు గ్యాస్ ఏజెన్సీలోకి చొరబడి ఉద్యోగిపై దాడి చేయడంతో పాటు రూ.5 లక్షలు దోచుకువెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన తొండెపు శ్రీనివాస్‌రావు ఫిలింనగర్‌లోని మాధవి గ్యాస్ ఏజెన్సీలో రెండేండ్లుగా ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. గత శుక్రవారం రాత్రి పదిన్నర గంటల సమయంలో గ్యాస్ ఏజెన్సీ మూసిన శ్రీనివాస్.. గేట్లకు తాళాలు వేసి మొదటి ఫ్లోర్‌కు వెళ్లి అకౌంట్స్ చూసుకుంటున్నాడు. కాసేపటికి ఇద్దరు దుండగులు ముసుగులు ధరించి శ్రీనివాస్ ఉన్న గదిలోకి ప్రవేశించారు. దాడి చేయడంతో పాటు కిందపడేసి మెడపై కాలితో తొక్కిపట్టడంతో పాటు స్ప్రే చల్లారు. రాడ్‌తో తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గదిలో ఉన్న రూ.5లక్షల నగదుతో పాటు ఫోన్‌ను తీసుకుని గది బయట నుంచి గొళ్లెం పెట్టి పారిపోయారు. రాత్రంతా తీవ్రమైన రక్తస్రావంతో ఉన్న శ్రీనివాస్ కేకలు పెట్టినా నిర్మానుష్య ప్రాంతం కావడంతో ఎవరూ రాలేదు. మరుసటి రోజు ఉదయం గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది శ్రావణ్, నరేశ్ వచ్చి చూడగా అపస్మారక స్థితిలో ఉన్న శ్రీనివాస్ కనిపించాడు. దీంతో అతడిని మెహిదీపట్నం సమీపంలోని ఓలివ్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో బాధితుడి వద్ద నుంచి ఫిర్యాదును స్వీకరించిన ఫిలింనగర్ పోలీసులు ఐపీసీ 394 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మార్కులు తక్కువొచ్చాయని..

ఘట్‌కేసర్, మే 12: మార్కులు తక్కువగా వచ్చాయని ఇతర విద్యార్థుల ముందు అవమానంగా భావించిన ఓ విద్యార్థిని క్లాస్ రూంలో ఊరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. సీఐ సైదులు కథనం ప్రకారం... ఘట్‌కేసర్ మండలం ఘనాపూర్‌లోని హ్యాపీ హోమ్(ఆర్ఫాన్ హోమ్)లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న కె.స్వప్న(20)కు గత నెలలో వచ్చిన ఫలితాల్లో వెయ్యికి 700 మార్కులు వచ్చాయి. దీంతో తనకు మార్కులు తక్కువగా వచ్చాయని తోటి విద్యార్థులకు చెప్పుకుంటూ బాధపడేది. ఈ క్రమంలో ఆదివారం క్లాస్ రూంలోకి వెళ్లి చున్నీతో ఊరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆర్ఫాన్ హోమ్ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దారి కాచి దోపిడీ

బంజారాహిల్స్, మే 12 : దారి కాచి, దాడి చేసి నగదును దోచుకున్న దుండగులు పారిపోయారు. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. గోల్కొండకు చెందిన ఎండీ జావేద్ (27) వీడియో గ్రాఫర్. సాయంత్రం పని ముగిసిన తర్వాత అతడి స్నేహితులు సయ్యద్ మహ్మద్ అమీర్, సోహైల్‌తో కలిసి హకీంపేట మీదుగా ఇంటికి వెళ్తున్నాడు. అదే క్రమంలో ఐదుగురు దుండగులు వారిని అటకాయించారు. అకారణంగా పిడిగుద్దులు గుద్ది దాడి చేశారు. బాధితుడి వద్ద ఉన్న నగదు తీసుకొని పారిపోయారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నాటి పనులే.. నేటికీ నిదర్శనం..

- గతంలో చెరువుల్లో నీరు పుష్కలం
- మిషన్ కాకతీయతో నీటి నిల్వలు
- బీఆర్ఎస్ పాలనలో చెరువులకు మహర్దశ

మల్లమ్మ చెరువు దుస్థితి

ముజాహిద్‌పూర్ అక్కమ్మ చెరువు

కాముని చెరువులో తగ్గిన నీళ్లు

కులకచర్ల, మే 12 : చెరువుల పునరుద్ధరణకు గతంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మిషన్ కాకతీయ ద్వారా చర్యలు తీసుకోవడంతో చెరువుల్లో నీరు నేటి వరకు కూడా ఎండిపోకుండా ఉండేందుకు దోహద పడుతుంది. నాటి ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయాల వలనే నేటికీ చెరువుల్లో నీళ్లు కొంతైనా కనిపిస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శిథిలమైన చెరువులను పునరుద్ధరించి వాటిని ఉపయోగంలోకి తీసుకువచ్చారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాతల గోస చాలా ఇబ్బందికరంగా తయారైందని రైతులు పేర్కొంటున్నారు. కులకచర్ల మండలంలో ముజాహిద్‌పూర్ అక్కమ్మ చెరువు, కామునిపల్లి కామునిచెరువు, అంతారం పాటిమిది చెరువు, కులకచర్ల మైలమ్మ చెరువు, ఇప్పాయిపల్లి చెరువు, వీటితో పాటు చాలా చెరువులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పునరుద్ధరించబడ్డాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిండుకుండలా ఉన్న చెరువులు ఒట్టి పోతున్నాయి. గతంలో చెరువుల కింద మూడు పంటలు పండిస్తే నేడు రెండు పంటలు కూడా పండించలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కామునిచెరువు కింద సుమారుగా 500 ఎకరాల సాగు జరిగేది. ఈ సంవత్సరం కనీసం 200ఎకరాలు కూడా సాగు చేయలేక పోయారు. కులకచర్ల మండల కేంద్రంలో ఉన్న మైలమ్మ చెరువు కింద 700 ఎకరాల వరకు సాగు చేసేవారు. నేడు 300ఎకరాలు కూడా సాగు చేయలేక పోయారు. అదే విధంగా ముజాహిద్‌పూర్ అక్కమ్మ చెరువు కింద 800 ఎకరాలు సాగు చేయాల్సి ఉండగా కనీసం 300ఎకరాలు కూడా సాగు చేయలేక పోయారు.

చెరువుల పునరుద్ధరణ భేష్..

బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చెరువుల పునరుద్ధరణ జరిగింది. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో పూడికతీత తో పాటు కట్టల మరమ్ముతులు, తూముల మరమ్మతులు చేసి చెరువుల్లో నీళ్లు పూర్తి స్థాయిలో నిలిచే విధంగా ఉండేది. మిషన్ కాకతీయ పుణ్యమా అంటూ రైతులు ప్రతి సంవత్సరం మూడు పం టలు సాగు చేసేవారు. కానీ నేడు చెరువుల్లో నీళ్లు పూర్తి స్థాయిలో ఎండి పోవడంతో ఈ పంట సాగు చేసే పరిస్థితులు లేవు.

– పాల మహిపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కామునిపల్లి, కులకచర్ల

ప్రభుత్వం ఆదుకోవాలి..

ప్రస్తుత ప్రభుత్వం రైతులను ఆదు కోవాలి. చెరువుల కింద వేసిన పం ట లు పూర్తి స్థాయిలో నీళ్లు సరిపోక ఎండిపోయాయి. పంటలు ఎండిపో వడంతో రైతు లకు పెట్టుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం రైతులకు న్యాయం చేయాలి. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం, రాష్ట్రాభివృద్ధి జరు గు తుంది.

– శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్ దాస్యనాయక్‌తండా, కులకచర్ల

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్
(స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్ యాక్ట్ క్రింద విలీనం చేయబడింది. LXIII ఆఫ్ 1951)
రంగారెడ్డి (వెస్ట్) శాఖ

స్వాధీనతా ప్రకటన
[చట్టం రూల్-8(1) క్రింద అనుబంధం IV]

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్‌తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్** అధీకృత అధికారియగు దిగువ సంతకందారు సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న మొత్తం **రూ. 96,66,000/-(తొంబై ఆరు లక్షల అరవై ఆరు వేల రూపాయలు మాత్రమే)** తిరిగి చెల్లించడానికి ఆస్తి/షూరిటీ యజమానిని మరియు రుణగ్రహీత M/s **అల్-అజ్‌మత్ స్టోన్ క్రషర్ ఇండస్ట్రీ** వారిని కోరుతూ తేది **06.04.2024**న డిమాండ్ నోటీసు జారీ చేశారు. రుణగ్రహీత/షూరిటీ సదరు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **07 మే 2024** తేదీన స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీత/ఆస్తి యజమాని మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

ఆస్తితో ఎటువంటి వ్యవహారాలు చేయ వద్దని మరియు ఆస్తికి సంబంధించిన ఏవైనా లావాదేవీలు మొత్తం **రూ. 96,66,000/-** మరియు దానిపై వడ్డీ, ఖర్చులు మొదలగు వాటికి సంబంధించి **ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్,** రంగారెడ్డి (వెస్ట్) శాఖ యొక్క ఛార్జ్‌కు లోబడి ఉంటాయని ముఖ్యంగా ఆస్తి యొక్క రుణగ్రహీత/షూరిటీ మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

స్థిరాస్తి వివరణ: రంగారెడ్డి జిల్లా, తాండూరు మండలం, గౌతాపూర్ గ్రామం యొక్క సర్వే నం. 45 & 46 భాగంలో విస్తీర్ణం 1080 చ.గజాల ప్లాట్ నం.2లోని భూమి మరియు భవనాలపై ఫ్రీ హోల్డ్ ఆస్తి మరియు సరిహద్దులు: ఉత్తరం: ప్రభుత్వ భూమి, దక్షిణం: 30 అడుగుల వెడల్పు గల ప్రతిపాదిత భూమి, తూర్పు: ప్లాట్ నం.1 మరియు పడమర: ప్లాట్ నం. 3 & హై పోలిషింగ్ మెషిన్స్.

తేది: 07.05.2024, **అధీకృత అధికారి,**
ప్రదేశ్: హైదరాబాద్ **ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్**